క్లుప్తంగా

దేశ భక్తి అందరికీ స్ఫూర్తి


ఓబన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న దేశభక్తి అందరికీ స్ఫూర్తి కావాలని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. చిట్వేలి రోడ్డులోని ఓబన్న విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓబన్న స్వాతంత్ర్య పోరాట చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్. రమేష్, మందల నాగేంద్ర, బత్తల సుబ్రహ్మణ్యం, సుధాకర్, రామయ్య, మల్లి, గోపి, పోతయ్య, నౌఫ్, కృష్ణారెడ్డి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం పరిధిలో 8 మద్యం షాపులు


మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

సిద్దవటం : సిద్దవటం ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిదిలో ఎనిమిది మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. విలేకరులతో ఆయన సిద్దవటం మండలంలో ఐదు, ఒంటిమిట్ట మండలంలో రెండు, అట్లూరు మండలంలో ఒక దుకాణం ఏర్పాటు చేస్తున్నామని, ఒక వ్యక్తి ఎన్ని మద్యం షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ నెల 11న వైఎస్ఆర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల ఎంపిక జరుగుతుందన్నారు.

వాహనదారులకు జరిమానా


ఎస్ఐ ఎం శ్రీనివాసులు

సుండుపల్లె : మండల పోలీస్ స్టేషన్ పరిధిలో తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి పట్టుబడ్డారని ఎస్ఐ ఎం.శ్రీనివాసులు తెలిపారు. రాయచోటి స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఇద్దరినీ హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.10500లు జరిమానా విధించినట్లు సుండుపల్లి ఎస్ఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వ భూములను గిరిజనులకు పంచాలి


మాట్లాడుతున్న బీకేఎంయూ నాయకులు

చిట్వేలి : అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రభుత్వ భూములను గిరిజనులకు పంచాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం, బికెఎంయూ నాయకులు పండుగోల మణి, సీపీఐ కార్యదర్శి తిప్పనప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో సాగుకు అనుకూలమైన అటవీ బీడు భూములను ఒక్కో గిరిజన కుటుంబానికి మూడు ఎకరాలు చొప్పున పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జయరామయ్య, ఆదినారాయణ, శివయ్య, రెడ్డయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తం ఇవ్వండి.. ప్రాణాలు కాపాడండి


రక్తదానం చేస్తున్న యువకులు

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరూ రక్త దానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడాలని లక్కిరెడ్డిపల్లి హెల్పింగ్ బ్లడ్ క్యాంప్ సంస్థ సభ్యులు సలీమ్, మునీర్, ముజాహిద్, ఇంతియాజ్, మహబూబ్ బాషా పేర్కొన్నారు. మండలంలోని జడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం 50 మంది యువకులు రక్తదానం చేశారు.

నిధులు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్ : పాఠశాలల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రాంటును విడుదల చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, అధికార ప్రతినిధి ముత్తోజి వీరబ్రహ్మం డిమాండ్ చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్కపైసా కూడా గ్రాంటును ఇవ్వలేదన్నారు. ప్రధానోపాధ్యాయులే సొంత నిధులను ఖర్చు చేస్తూ చాక్‌పీస్‌లు, పొరకలు, కరెంటు బిల్లులు, చిన్నచిన్న రిపేర్లు మొదలకు పనులను చేస్తున్నారన్నారు.

కట్టేదెప్పుడో.. ఆనకట్ట

కోట్ల రూపాయలు నిధులు వెచ్చించినా.. నాడు ఆనకట్ట నిర్మాణానికి ముందడుగు పడలేదు. వందలాది ఎకరాల ఆయకట్టుకు నీరందించే చెరువు నిర్మాణానికి అడుగులు పడలేదు. 2006లో నిధులు మంజూరై ఇప్పటికి 24 ఏళ్లు గడచినా నిలిచిపోయిన ఆనకట్ట నిర్మాణంపై దృష్టి పెట్టడం లేదు.

- 2006లో రూ.2.25 కోట్లతో పనులు ప్రారంభం
- 24 ఏళ్లు గడచినా పూర్తి చేయలేదు


పునాదుల వరకే నిర్మాణం

చిట్వేలి : భూగర్భ జలాల పెంపు.. 1800 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ.. లక్ష్యంగా నిర్మించిన అతిపెద్ద చెరువు యల్లమరాజుచెరువు. రాజుకుంట చెరువు అలుగు, అడవి నుంచే వచ్చే వరద నీరు కలిసి చెర్లోపల్లి సమీపంలో ఏరులో కలుస్తుంది. ఈ నీటిని నిలిపి వందల ఎకరాల ఆయకట్టుకున నీరందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2006లో రూ.2.25 కోట్ల నిధులు మంజూరు చేశారు. 2007లో పనులు ప్రారంభించగా.. వరదలకు మెటీరియల్ కొట్టుకుపోవడం, భూములు ముంపునకు గురయ్యాయని యజమానులు ఆందోళన చేయడంతో అప్పట్లో నిర్మాణం నిలిచిపోయింది. అనంతరం 24 ఏళ్లు గడచినా ఈ ఆనకట్ట నిర్మాణానికి అడుగులు పడలేదు.

అడ్డంకులు తొలగినా..

ఆనకట్ట నిర్మాణానికి ఉన్న కొన్ని అడ్డంకులు తొలగిపోయాయి. ప్రధాన అడ్డంకిగా ఉన్న అలుగు ఏరు దాటికి జనం ఇబ్బంది పడకుండా హైలెవల్ బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు నిర్మాణం, కరెంటు లైన్ మార్పిడి వంటి ఏర్పాట్లు జరిగాయి. పైతట్టు ప్రాంతంలో ఉన్న 20 నుంచి 25 ఎకరాల సాగు భూములకు నష్టపరిహారం చెల్లించినట్లయితే.. ఆనకట్ట నిర్మాణానికి మార్గం సుగమమవుతుంది. స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆనకట్టను పునర్నిర్మించాలని రైతులు, మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భూగర్భ జలాలు పెరుగుతాయి



ఆనకట్ట నిర్మాణంతో మండల స్థాయిలో భూగర్భ జలమట్టం పెరుగుతుంది. బోర్లలో నీరు సమృద్ధిగా వస్తుంది. పంటలు సాగు చేసేందుకు వీలవుతుంది. రైతుల బాగోగులు చూసి తక్షణమే ఆనకట్ట నిర్మించాలి.

– షేక్ టెంకాయల ఖాశి, చిట్వేలి, అన్నమయ్య జిల్లా

కొత్త చెరువు ఏర్పాటవుతుంది



అలుగు ఏరుపై ఆనకట్ట నిర్మాణం పూర్తిచేస్తే కొత్త చెరువు ఏర్పాటవుతుంది. 350 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఆనకట్ట నిర్మాణంతో ప్రయోజనాలు ఉన్నప్పటికీ నిర్మించకపోవడం అన్యాయం. ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించాలి.

– మన్నూరు సుధీర్ రెడ్డి, మార్గోపల్లి, చిట్వేలి మండలం

9 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


ఆలయంలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి

రాజంపేట టౌన్ : మండలంలోని చుండువారిపల్లెలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 9న సాయంత్రం ఐదు గంటలకు గణపతి పూజతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 10న ప్రాతఃకాల పూజలు, దీక్షాహోమం, పంచామృతాభిషేకం, అభిషేకం, హోమం, సాయంత్రం లలితా సహస్ర నామం, విష్ణు సహస్రనామం, పారాయణ కార్యక్రమాలు ఉంటాయి. 11న ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి కల్యాణ మహోత్సవం, అనంతరం అన్నదానం ఉంటాయి. అదే రోజు సాయంత్రం స్వామిని పురవీధుల్లో ఊరేగిస్తారు.

లక్ష రూపాయల విరాళం

సుండుపల్లె : మండలంలోని ఏటిగడ్డ రాచపల్లి వద్ద నిర్మిస్తున్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రాజంపేట మండలం మందరం రాచపల్లికి చెందిన ముప్పాల చిన్నపరాజు, వారి కుటుంబ సభ్యులు లక్ష రూపాయల విరాళాన్ని ఓం ఛారిటబుల్ ఫౌండేషన్ సభ్యులకు ఆదివారం అందజేశారు. సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

వర్షాలు కురిపించు గంగమ్మతల్లీ


పూజలు అందుకుంటున్న గంగమ్మ తల్లి


మల్లూరమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లి : గంగమ్మా.. వర్షాలు కురిపించి కాపాడు తల్లీ అంటూ ఆదివారం అనంతపురం గంగమ్మ ఆలయంలో అమ్మవారికి వేలాది భక్తులు బోనాలు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరడంతో చిన్నపాటి జాతరను తలపించింది. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ప్రత్యేక అధికారి మారుతీ ప్రసాద్ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : వర్షాలు కురిపించాలని ఆరాధిస్తూ మండలంలోని కదిరివాండ్లపల్లె గ్రామస్థులు మాండవ్యా నది ఒడ్డున వెలసిన మల్లూరమ్మ తల్లికి ఆదివారం బోనాలు సమర్పించారు. గ్రామస్తులు సామూహికంగా బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కంపు కొడుతున్నా పట్టించుకోరా


మురుగు కాల్వలు చూపుతున్న సీపీఐ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి పంచాయతీలో అభివృద్ధి జరగలేదని, ఇళ్ల మధ్య మురుగు నీరు ప్రవహిస్తూ కంపు కొడుతున్నా పట్టించుకోవడం లేదని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఒకటో వార్డులో మురుగు కాల్వలను వారు పరిశీలించారు. సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏ వార్డులో చూసినా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని అన్నారు. పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.రమేష్, కె.ఓబులేసు, ఎం.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

లక్కిరెడ్డిపల్లి : ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ హిమబిందు పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ పరిధిలోని రెండు, రామాపురం మండలంలో రెండు, గాలివీడులో మూడు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ కార్యాలయం, లేదా మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అహ్మద్, ఈశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుణంపల్లిలో నేడు విద్యుత్తు బంద్

పెనగలూరు : మండలంలోని తిరుణంపల్లిలో సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ షఫీ తెలిపారు. తిరుణంపల్లి, సిరివరం, పెనగలూరు ప్రాంతానికి సంబంధించిన నియంత్రికలకు మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని వారు కోరారు.

బొప్పాయి నర్సరీలతో మహిళలకు ఉపాధి


గింజలు నాటడానికి కవర్లలో మట్టి పెడుతున్న మహిళలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బొప్పాయి నర్సరీలతో మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఓ మోస్తరు వర్షాలు పడడంతో ఏటా రైతులు బొప్పాయి పంట సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇది ఆసరాగా తీసుకున్న కొందరు దాదాపు మండలంలో 15 నర్సరీలు ఏర్పాటుచేసి మొక్కలు పెంచుతున్నారు. మొలకకు రూ.3.50 చెల్లించి తీసుకెళ్లి.. 45 రోజుల తర్వాత రైతులు భూమిలో నాటుతారు. ఒక్కొక్క నర్సరీ నుంచి ఇలా లక్షల సంఖ్యలో మొలకలు ఎగుమతి అవుతున్నాయి. కడప, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలతోపాటు తమిళనాడు రాష్ట్ర రైతులు ఇక్కడికి వచ్చి మొక్కలు తీసుకెళ్తున్నారు. జులై చివరి నుంచి నవంబరు వరకు 2 కోట్ల బొప్పాయి మొలకలు ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నారు. ఒక్క రాఘవరాజపురంలోనే ఎనిమిది నర్సరీలు ఉండడంతో అక్కడివారే గాక ఇతర ప్రాంతాల మహిళలకు ఉపాధి కలుగుతోంది.

పసుపు రైతులకు అవగాహన


పసుపు పంటను పరిశీలిస్తున్న బద్వేల్ ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి

సిద్దవటం : పసుపు పంట సాగు చేసిన రైతులు ఉద్యాన అధికారుల సలహాలు తీసుకోవాలని బద్వేల్ ఉద్యాన శాఖ అధికారి జి.జయభరత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ పరిధిలోని భాకరాపేట, బొగ్గిడివారిల్లె, మాధవరం –1 పంచాయతీల్లో రైతులు సాగు చేసిన పసుపు పంటను ఆదివారం ఆయన పరిశీలించారు. పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంటకు తడులు ఇవ్వాలని తెలిపారు. దుంపకుళ్లు ఆశించిన తోటల్లో రిడోమిల్ లేదా బ్లైటాక్స్ మూడు గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పసుపు సాలల్లో వేరు తడిచేలా పోయాలన్నారు. పైపాటుగా 19:19:19 మందు పది గ్రాముల చొప్పున లీటరు నీటికి, సాఫ్ మందు రెండు గ్రాములు లీటరు నీటికి, ఫెర్రస్ సల్ఫేట్ మందు రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే సూక్ష్మ పోషకాల లోపాలను నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ సందీప్, సందీప్ సింహ పాల్గొన్నారు.

సాయం అందక.. రైతులకు కష్టాలు


పంట సాగుకు సిద్ధంగా ఉన్న భూమి

పుల్లంపేట: కూటమి ప్రభుత్వం హామీ అమలు చేయకపోవడంతో రైతన్న దిగాలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏటా పెట్టుబడి సాయంగా..రూ.13500 సాయం అందేది.. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులకు పైబడినా ఆ హామీ వట్టిమాటగానే మిగిలిపోయింది. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని రైల్వే కోడూరులో 5417 మంది, ఓబులవారిపల్లెలో 5872, చిట్వేలిలో 5715, పుల్లంపేటలో 4857, పెనగలూరులో 5933 మంది రైతులు ఉన్నారు. గతంలో వీరందరికీ సాయం అందడంతో పంట సాగు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో రూ. 25 వేలు ఏటా రైతులకు అందిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. నాలుగు నెలలు గడచినా ఇంత వరకూ రూపాయి కూడా జమ చేయలేదు. ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమైనప్పటికీ తమను పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమలపాకు సాగు చేయాలంటే ఎకరాకు రూ.2 లక్షలు, బొప్పాయి తోటకు ఎకరాకు రూ.1లక్ష, అరటి సాగుకు ఎకరాకు రూ.1.50 లక్ష చొప్పున రైతులు వెచ్చించాల్సి వస్తోంది. పెట్టుబడి సాయం అందితే కొంత ఊరట కలుగుతుందని, ప్రభుత్వం చొరవ చూపి వెంటనే అందజేయాలని రైతులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డి


శివ పార్వతి పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సుండుపల్లె : చిన్ననాటి తోటి విద్యార్థులను ఆదుకుని, స్నేహ భావంతో ఉండాలని సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి అన్నారు. సుండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 సంవత్సరంలో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. తమ గురువులను ఘనంగా సన్మానించారు. రిజిస్ట్రార్ ఆనంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గురువులను మరచిపోకుండా ఈ కార్యక్రమాల ద్వారా సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. అదే బ్యాచ్‌లో వికలాంగుడైన రాజారెడ్డి, ఈశ్వరమ్మలకు ఒక్కొక్కరికి సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డి రూ. 20వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, రామచంద్రరాజు, పాలకొండమ్మ, శివయ్య, ప్రకాష్ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శివపార్వతీ పాఠశాలలో

పుల్లంపేట : పుల్లంపేట శివపార్వతీ పాఠశాలలో 2003–04 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఇరవై ఏళ్ల తర్వాత కలుసుకుని అంతా నాటి తీపి గుర్తులను ఒకరినొకరు పంచుకున్నారు. అనంతరం నాడు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇరవై ఏళ్ల తర్వాత తమను గుర్తు పెట్టుకొని గురువుల ఆశీర్వాదం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సోము బాలాజీ, భాగ్యలక్ష్మీ, ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, నరసింహులు, నాగరాజు, మాధవి, శివజ్యోతి పాల్గొన్నారు.

వన విహారిణీ.. నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎటు చూసినా దసరా సందడి కనిపిస్తుంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారిని కృష్ణమూర్తి, ధనలక్ష్మీదేవి, త్రిపుర సుందరీదేవి, అన్నపూర్ణగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆలయాల్లో కుంకుమార్చన చేశారు. ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.


వీరబల్లి: ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ తల్లి


సంబేపల్లె: దేవరరాయి నల్లగంగమ్మ తల్లి


రామాపురం: నీలకంఠ్రావుపేటలో గజలక్ష్మీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరీ దేవి


సిద్దవటం: ఉప్పరపల్లి వద్ద సాయినగర్‌లోని విజయదుర్గాదేవి


సిద్దవటం: మాధవరం-1లో గజలక్ష్మీ దేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


రాజంపేట టౌన్ : శ్రీకృష్ణమూర్తి అలంకారంలో వాసవీమాత


రాజంపేట టౌన్ : ధనలక్ష్మీదేవి అలంకారంలో వీరచౌడేశ్వరీదేవి


నందలూరు: కృష్ణమూర్తి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ


చిన్నమండెం: వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా


సాయినగర్ అనంతాశ్రమంలో దర్గామాతాజీ


లక్కిరెడ్డిపల్లి: విశ్వభారతి స్కూల్ సమీపంలో సర్వ మంగళాదేవికి అలంకరణ


రైల్వేకోడూరు అర్బన్: కన్యకాపరమేశ్వరికి వన విహారిణీ అలంకరణ


పెనగలూరు: పెనగలూరు శివాలయంలో అమ్మవారు

నోట్లతో అలంకరణ


నోట్లతో అమ్మవారికి అలంకరణ

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారిని ఆదివారం గజలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రూ. 50వేల విలువగల రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200 నోట్లు ఉపయోగించి అలంకరించినట్లు ఆలయ అధ్యక్షుడు సోమిసెట్టి మనోహర్ బాబు తెలిపారు. అనంతరం భక్తులు దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.


పుల్లంపేట: తిప్పాయి గ్రామంలో లలితా త్రిపురాసుందరీ దేవిగా అమ్మవారు